పర్సులో దాచిన నగలు మాయం

యూసఫ్‌గూడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పర్సులో దాచిపెట్టిన నగలు మాయమయ్యాయని ఓ మహిళ మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సిద్ధార్థనగర్‌లోని విజయదుర్గా రెసిడెన్సీలో నివాసముండే వి.శిరీష కుమార్తె శ్రావ్య (14) టీవీ సీరియల్‌లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా చేస్తుంది. ఈనెల 22న కుమార్తెతో కలిసి షూటింగ్‌కు వెళ్లిన శిరీష అర్ధరాత్రి తరువాత నల్లపూసలు గొలుసు, కుమార్తె చైన్.. మొత్తం 3 తులాల బంగారు నగలు బ్యాగులో పెట్టుకుని కారులో ఇంటికి వచ్చారు. ఈనెల 26న బ్యాగు చూడగా అందులో నగలు కనిపించలేదు. మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగి ఇంట్లోని బంగారం చోరీ

బోరబండ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి విధులకు వెళ్లొచ్చే సరికి ఇంట్లో బంగారు, వెండి ఆభరణాలు మాయమైన సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన అంజి జూబ్లీహిల్స్‌లోని ఎంసీహెచ్‌ఆర్‌డీలో పనిచేస్తున్నాడు. ఈ నెల 25న విధులకు హాజరై రాత్రి ఇంటికి వచ్చే సరికి తలుపు పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని బంగారం, వెండి ఆభరణాలు కనిపించలేదు. ఇంట్లో అద్దెకుంటున్న మహిళపై అనుమానం ఉన్నట్లు బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

హత్య కేసులో వీడిన మిస్టరీ

● 10 మందికి రిమాండ్

అల్లాపూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ సఫ్దర్‌నగర్‌లో ఇటీవల జరిగిన హత్య మిస్టరీని పోలీసులు వారం రోజుల్లోనే చేదించారు. హతుడు యహ్యా డానిష్(17), నిందితుల్లో ఒకడైన మైనర్ ఒకే అమ్మాయితో సన్నిహితంగా ఉండటమే ఈ హత్యకు కారణమని, పక్కా పథకం ప్రకారమే హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. అల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉంటున్న డానిష్ గత శనివారం రాత్రి స్నేహితులు పిలిచారంటూ ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అదేరోజు రాత్రి స్నేహితులు జహీర్, ఆమెర్, షోయబ్, రేహాన్‌లతో కలిసిన మైనర్ నిందితుడు.. డానిష్‌ను బీరు బాటిళ్లతో కొట్టి, శరీరంలో పొడిచారు. అనంతరం డానిష్‌ది ఆత్మహత్యగా చిత్రీకరించే క్రమంలో బోరబండ ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్ సమీపంలో ట్రాక్‌పై వదిలేశారు. ట్రాక్‌పై నుంచి రైలు వెళ్లిన కారణంగా డానిష్ శరీరం ఛిద్రమయింది. డానిష్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో అల్లాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఐదు రోజుల విచారణానంతరం కేసు కొలిక్కి వచ్చింది. అయితే నిందితులు 10 మందిలో ఐదుగురు మైనర్లు ఉండటం గమనార్హం. శుక్రవారం వారందరినీ రిమాండుకు తరలించినట్టు సమాచారం.



పోలీసులు అరెస్టు చేసిన హుక్కా నిర్వాహకుడు, చిత్రంలో స్వాధీనం చేసుకున్న సామాగ్రి


హుక్కా సెంటర్‌పై పోలీసుల దాడి

● 1.2 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కేఫ్ మాటున హుక్కా సెంటర్ నిర్వహిస్తున్న వ్యక్తిని, అతడి అనుచరులను వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. టోలిచౌకికి చెందిన మహ్మద్ అబ్దుల్ లతీఫ్‌ఖాన్ పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో మియామీ గల్లీ కేఫ్‌ను నిర్వహిస్తున్నాడు. ఇందులో అక్రమంగా హుక్కా పార్లర్ నిర్వహిస్తూ డబ్బులు సంపాదిస్తున్నాడు. విషయం తెలుసుకున్న వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ బృందం, పంజాగుట్ట పోలీసులు గురువారం రాత్రి దాడి చేసి నిర్వాహకుడు.. అతని అనుచరులు... మొత్తం 9 మందిని అరెస్టు చేశారు. హుక్కా తాగుతున్న మరో 15 మంది వినియోగదారులను అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకుడి నుంచి రూ. 1.2 లక్షల విలువైన హుక్కా సామాగ్రి స్వాధీనం చేసుకున్నారు. పంజాగుట్ట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సికింద్రాబాద్ నుంచి తుక్కుగూడ ఫ్యాబ్‌సిటీకి బస్సు

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం సికింద్రాబాద్ నుంచి తుక్కుగూడ ఫ్యాబ్‌సిటీ వరకు జూలై 1వ తేదీ నుంచి బస్సును ప్రారంభించనట్లు ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు. రాణిగంజ్ డిపో నుంచి రూట్ నెంబర్ 90/253టి నెంబర్‌తో బస్ సర్వీస్ నడుస్తుందని తెలిపారు. బస్సులు సికింద్రాబాద్, తార్నాక, ఎన్‌జీఆర్‌ఐ, సర్వే ఆఫ్ ఇండియా, నాగోల్ మెట్రోస్టేషన్, సాగర్ క్రాస్‌రోడ్స్, చంపాపేట క్రాస్‌రోడ్స్, బార్కస్, పహాడిషరీఫ్, తుక్కుగూడ, ఇమాంగూడ మీదుగా ఫ్యాబ్‌సిటీకి చేరుకుంటాయని తెలిపారు. ఫ్యాబ్‌సిటీలో పనిచేస్తున్న వారి సౌకర్యార్థం ఈ సర్వీసును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.



క్రీడాకారులతో అరోమ సింగ్

ఆర్పీఎఫ్ బ్యాడ్మింటన్ విజేత సికింద్రాబాద్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆర్పీఎఫ్ ఇంటర్ డివిజనల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ 45 ప్లస్ విభాగంలో పురుషుల సింగిల్స్, డబుల్స్ టైటిళ్లను సికింద్రాబాద్ డివిజన్ కైవసం చేసుకుంది. ఈనెల 26వ తేదీ నుంచి సికింద్రాబాద్‌లోని మల్టీపర్పస్ రైల్వే స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియం కాంప్లెక్స్‌లో జరుగుతున్న ఈ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఇందులో విజయవాడ, గుంతకల్, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్ జట్లు తలపడ్డాయి. దక్షిణమధ్య రైల్వే ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమ సింగ్, విజేతలకు పతకాలు, ట్రోఫీలు ప్రదానం చేశారు.



మాదాపూర్‌లో తనిఖీ చేస్తున్న ఈవీడీఎం కమిషనర్ ఏవీ.రంగనాథ్

క్యాచ్‌పిట్ల వద్ద చెత్తా,చెదారం తొలగించండి..!

● ఏవీ.రంగనాథ్

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వరద నీటి ప్రవాహం సాఫీగా వెళ్లేలా క్యాచ్‌పిట్ల వద్ద ఉన్న చెత్తా,చెదారాన్ని వెంటనే తొలగించాలని ఈవీడీఎం కమిషనర్ ఏవీ.రంగనాథ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మాదాపూర్‌లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. గ్రేటర్‌లోని 140 ప్రాంతాల్లో వరద నీరు నిలుస్తుందని గుర్తించిన నేపథ్యంలో ఆ ప్రాంతాల్లో వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా ఏం చేయాలన్నది పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో క్యాచ్‌పిట్ల వద్ద చెత్తా,చెదారం ఉండడాన్ని గమనించిన ఆయన వెంటనే తొలగించాలన్నారు. వాహనదారులు ప్రమాదానికి గురవకుండా రహదారులపై ఇసుక, కంకర మేటలు తొలగించాలని సూచించారు.

రైతులకిచ్చిన హామీని ప్రధాని నిలబెట్టుకోవాలి

● సంయుక్త కిసాన్‌మోర్చా డిమాండ్



రైతులపై ప్రయోగించిన తుపాకీ తూటాలు, బాష్పవాయు గోళాలు, రాకెట్ బాంబులను చూపిస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు

పంజాగుట్ట, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో రైతులకు వ్యతిరేకంగా ప్రధాని నరేంద్ర మోదీ తీసుకొచ్చిన నల్ల చట్టాలను ఉపసంహరించుకునే సమయంలో రైతులకిచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సంయుక్త కిసాన్‌మోర్చా డిమాండ్ చేసింది. రైతుల డిమాండ్లు పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని, హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ప్రచార యాత్రలు నిర్వహిస్తామని మోర్చా నాయకులు హెచ్చరించారు. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన రైతుల మద్దతు కూడగట్టేందుకు మోర్చా ఆధ్వర్యంలో చేపట్టిన యాత్ర నగరానికి చేరుకున్న సందర్భంగా శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో కిసాన్‌మోర్చా జాతీయ కన్వీనర్ జగ్జిత్ సింగ్ దల్లెవాలా, జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లమల వెంకటేశ్వరరావు, దక్షిణ భారత రాష్ట్రాల సమన్వయకర్త కె.శాంతకుమార్, రైతు నాయకుడు పి.చంగల్ రెడ్డి, వివిధ రాష్ట్రాల నాయకులు మాట్లాడారు. ప్రధాని మోదీకి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే కనీస మద్దతు ధరకు సంబంధించిన చట్టాన్ని చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎంఎస్‌పీ హామీ చట్టం కోసం ఫిబ్రవరి 13 నుంచి 4 చోట్ల నిరసనలు చేస్తున్నామని, 125 రోజులకు పైగా వేలాది మంది రైతులు రోడ్డెక్కుతున్నారని, కేంద్ర ప్రభుత్వం దానిని నెరవేర్చే వరకు నిరసన కొనసాగుతుందని తెలిపారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందు ఢిల్లీలో రెండు భారీ రైతు సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల్లో రైతు ర్యాలీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం రూ. 2 లక్షల వరకు రైతుల రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు, పెట్టుబడిదారులకు రూ. 14 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసి రైతులకు ద్రోహం చేసిందని ఆరోపించారు. రైతుల పోరాటం శాంతియుతంగా సాగుతోందని, రైతులు వ్యవసాయం మానేస్తే దేశంలో ఆకలి విప్లవం వస్తుందని హెచ్చరించారు. స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని, 60 సంవత్సరాలు నిండిన ప్రతి రైతుకు పది వేల రూపాయలను పెన్షన్‌గా ఇవ్వాలని, ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని, ఉద్యమ కాలంలో చనిపోయిన రైతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని, ఇతర డిమాండ్ల పరిష్కారానికి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా రైతులపై ప్రయోగించిన తుపాకీ తూటాలు, భాష్ప వాయు గోళాలు, రాకెట్ బాంబులను వారు ప్రదర్శించారు. సమావేశంలో అభిమన్యు కోహర్, లక్వీందర్ సింగ్ (హర్యానా), పీఆర్ పాండ్యన్ (తమిళనాడు), సూర్జిత్ సింగ్ (ఉత్తరప్రదేశ్), జాఫర్ ఖాన్, సుఖ్‌జిత్ సింగ్ (న్యూఢిల్లీ), గోవింద రెడ్డి (కర్ణాటక) పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలకు మెరుగైన అవకాశాలు

● రిటైర్డ్ డీజీపీ అనర్వుల్లా హుదా



విద్యార్థులు రూపొందించిన నమూనాలను పరిశీలిస్తున్న రిటైర్డ్ డీజీపీ అనర్వుల్లా హుదా

బంజారాహిల్స్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఆలోచించే విద్యార్థులకు మెరుగైన అవకాశాలు ఉన్నాయని, ప్రస్తుతం మెకానికల్ ఇంజనీర్ల పాత్ర సమాజానికి ఎంతో అవసరమని రిటైర్డ్ డీజీపీ సయీద్ అనర్వుల్లా హుదా అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని ముఫకంజా ఇంజనీరింగ్ కాలేజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం వార్షికోత్సవంతో పాటు ప్రాజెక్ట్ ఎక్స్‌పో కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే ఉపకరణాలు విభిన్నరీతిలో ఆవిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. అలాంటి వారికి ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థలు ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులకు ప్రసంశా పత్రాలు అందించారు. అనంతరం విద్యార్థులు తయారుచేసిన విభిన్న రకాల ఉపకరణాలను పరిశీలించి అభినందించారు. ఎక్స్‌పోలో విద్యార్థులు పెడల్ పవర్ వాషింగ్ మెషిన్, సోలార్ పవర్ కటింగ్ మిషన్, సర్వేలైన్స్ కోసం రోబో డాగ్, ఎలక్ట్రిక్ బైక్ వంటి విభిన్న ఉత్పత్తులను ప్రదర్శించారు. కార్యక్రమంలో సుల్తాన్ ఉలూం ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి జాఫర్ జావేద్, ప్రిన్సిపల్ మహిపాల్ సింగ్ రావత్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఇష్రత్ మీర్జా, లక్ష్మి కుమారి, రిజిస్ట్రార్ నర్సింహారావు, డీన్ స్టూడెంట్స్ అఫైర్ ఫర్హాతుల్లా హుస్సేని పాల్గొన్నారు.

రిటైర్ అయ్యే మహిళా కార్మికులకు ప్రయోజనాలివ్వాలి

● కేజీబీవీ నాన్ టీచింగ్ మహిళా కార్మికుల ధర్నా



విద్యాశాఖ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్స్

ఖైరతాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా పాఠశాలలు, మోడల్ పాఠశాలలు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ స్టాఫ్‌కు ఉద్యోగ విరమణ అనంతరం అందాల్సిన ప్రయోజనాలతో పాటు పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరుతూ శుక్రవారం పాఠశాల విద్యా శాఖ కార్యాలయం వద్ద కేజీబీవీతో పాటు మోడల్ పాఠశాలల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ మహిళా ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. 61 సంవత్సరాలు దాటిన కార్మికులను తొలగించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో నష్టం జరుగుతుందని, తమకు న్యాయం చేయాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గంటా నాగయ్య, గీత మాట్లాడుతూ 20 ఏళ్లుగా కేజీబీవీలలో పనిచేస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న కార్మికులను వృద్ధాప్యం పేరిట నిర్లక్ష్యానికి గురిచేయడం సరికాదన్నారు. తొలగింపబడ్డ కార్మికులకు 25 లక్షల రూపాయల పరిహారం, ప్రతి నెలా 6 వేల రూపాయల పింఛన్ సదుపాయం కల్పించాలని కోరారు. ఉద్యోగం నుంచి తొలగించిన వారి స్థానంలో కుటుంబసభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటనారాయణ, అసోసియేషన్ ప్రతినిధులు గంగమ్మ, వందన, శకుంతల, పార్వతి, కమల, రాజమ్మ పాల్గొన్నారు.

శిశువిహార్ ఆయాల సమస్యలను పరిష్కరించాలి



జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వర్ రావుకు వినతిపత్రం ఇస్తున్న శిశువిహార్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు

పంజాగుట్ట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యాలయం ఆవరణలోని శిశువిహార్‌లో పనిచేస్తున్న ఆయాల సమస్యలు పరిష్కరించాలని శిశువిహార్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎం.వెంకటేష్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆర్.అశోక్, ఉపాధ్యక్షురాలు సుశీల, కోశాధికారి శ్యామల శుక్రవారం జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వర్ రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిశువిహార్‌లో పనిచేస్తున్న ఆయాలకు మే నెల వేతనాలు నేటికీ ఇవ్వలేదని, దీంతో వారు పిల్లల ఫీజులు, ఇంటి అద్దెలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆయాలకు పే స్లిప్పులు ఇవ్వాలని, ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. పదవీ విరమణ చేస్తున్న ఆయాలకు ప్రయోజనాలు ఇస్తామని గతంలో కమిషనర్ హామీ ఇచ్చారని, ప్రస్తుతం కొంతమంది ఆయాలు రిటైర్ అవుతున్నారని, వారికి ప్రయోజనాలు అందజేయాలని కోరారు. ఖాళీలు భర్తీ చేసి ఆయాలపై పనిభారం తగ్గించాలని కోరారు. కమిషనర్‌తో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వర్ రావు హామీ ఇచ్చారని వారు తెలిపారు. వారి వెంట యూనియన్ నాయకులు తార, ఆదిలక్ష్మి ఉన్నారు.

విగ్రహాల ముసుగు తొలగేనా..?


● ఉద్యోగ సంఘాలతో మేయర్ చర్చలు



ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చిస్తోన్న మేయర్ విజయలక్ష్మి

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో విగ్రహాల ముసుగు తొలగించే దిశగా అడుగులు పడుతున్నాయి. శుక్రవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సంస్థలోని ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చించారు. సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రం అందజేసేందుకు వచ్చిన వారితో విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి నిర్దిష్ట అభిప్రాయం చెప్పాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో దివంతగ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం ఆయన విగ్రహం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేయాలని అప్పటి స్టాండింగ్ కమిటీలో నిర్ణయించారు. విగ్రహాన్ని తయారు చేయించి మేయర్ కార్యాలయం గేటు వైపు ఏర్పాటు చేశారు. విగ్రహావిష్కరణ కార్యక్రమం జరగకముందే.. నాడు టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పోటీగా మహాత్మ గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలను తీసుకువచ్చి వైఎస్ విగ్రహం పక్కన పెట్టారు. ఇది వివాదాస్పదం కావడంతో మూడు విగ్రహాలకు ముసుగులు కప్పి ఉంచారు. దాదాపు దశాబ్దంన్నర కాలంగా విగ్రహాల ముసుగులు అలానే ఉన్నాయి. సున్నిత అంశం కావడం.. కేసు కోర్టు విచారణలో ఉండడంతో వాటిని ఎవరూ ముట్టుకోలేదు. ముసుగులతో విగ్రహాలు ఉండడం ఇబ్బందికరంగా ఉందని భావించిన మేయర్ ముసుగుల తొలగింపునకు ఉపక్రమించారు. ఈ విషయంపై ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చించారు. కార్యాలయ ప్రాంగణంలోని మరోచోట విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు అభిప్రాయం తీసుకున్నారు. గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలు ఏర్పాటు చేస్తే చాలని కొందరు చెప్పగా.. ఇంకొందరు మూడు విగ్రహాలు ఉండాలని పేర్కొన్నారు. ఈ విషయంపై ఏకగ్రీవ నిర్ణయంతో రావాలని.. మరోసారి సమావేశం నిర్వహించనున్నట్టు విజయలక్ష్మి తెలిపారు.

అత్యాచారం కేసులో మాజీ ఆర్మీ జవాన్‌కు 20 ఏళ్ల జైలు



పెరియాటీ శ్రీధరన్(జైలు శిక్ష పడిన వ్యక్తి)

రెజిమెంటల్‌బజార్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం చేసిన కేసులో మాజీ ఆర్మీ జవాన్‌కు 20ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ పోక్సో స్పెషల్ సెషన్స్ జడ్జీ తీర్పు వెలువరించారు. మార్కెట్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌లోని ఓ అనాథ శరణాలయంలో ఉంటున్న బాలిక 2017లో టైలరింగ్ శిక్షణకు వెళ్లివస్తూ సికింద్రాబాద్ బస్టాప్‌లో కూర్చొంది. ఆమె దగ్గరికి ఆర్మీలో జవాన్‌గా పదవీవిరమణ పొందిన యాప్రాల్‌కు చెందిన పెరియాటీ శ్రీధరన్(59) బైక్‌పై వచ్చి భోజనం చేశావా అంటూ బాలికను బలవంతంగా హోటల్‌కు తీసుకెళ్లి భోజనం చేయించాడు. అనంతరం లాడ్జీకి తీసుకెళ్లి అత్యాచారం చేసి ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించి సికింద్రాబాద్ మనోహర్ థియేటర్ దగ్గర వదిలేసి వెళ్లిపోయాడు. శరణాలయం హెల్త్‌వర్కర్ ఆరా తీయగా అత్యాచారం జరిగిన విషయం చెప్పింది. దీంతో అప్పట్లో (2017 జూలైలో) మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కోర్టులో విచారణ అనంతరం పోక్సో స్పెషల్ సెషన్స్ జడ్జీ పుష్పలత నిందితుడికి 20ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ.20వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

లిఫ్ట్ గుంతలో పడి వ్యక్తి మృతి

పేట్‌బషీరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు లిఫ్ట్ గుంతలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ ఎస్‌ఐ సురేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఛతీస్‌గఢ్‌కు చెందిన రమాదిపటేల్(30) బతుకుదెరువు కోసం నగర శివారులోని జీడిమెట్లలోని గ్రీన్‌పార్కులోని గణేష్ బిల్డర్స్ నిర్మాణం జరుగుతున్న భవనం వద్ద ఉంటున్న స్నేహితుడు వద్దకు పని కోసం గురువారం వచ్చాడు. సాయంత్రం స్నేహితుడితో మద్యం తాగి రాత్రి నిద్రపోయాడు. శుక్రవారం తెల్లవారే సరికి రమాదిపటేల్ లిఫ్ట్ గుంతలో పడి శవమై కనిపించాడు. స్నేహితులు పేట్‌బషీరాబాద్ పోలీసులకు, భవన నిర్మాణ యజమానులకు తెలియజేశారు. సమాచారం అందుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.



ఫిలింనగర్ అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షులు మామిడి నర్సింగ్‌రావు

ఘనంగా అభయాంజనేయస్వామి వార్షికోత్సవం

బంజారాహిల్స్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఫిలింనగర్, ఎమ్మార్పీ కాలనీలోని అభయాంజనేయ స్వామి వారి 17వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షులు మామిడి నర్సింగ్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అభయాంజనేయస్వామి యూత్ సభ్యులు ఆవుల రాజన్న, సాగర్, ముత్యాల శ్రీనివాస్ నాయుడు, జూబ్లీహిల్స్ డివిజన్ నాయకులు నగేష్, సాగర్, ఆకుల రాజు, బోయ సాయిలు, రవినాయక్, ఎస్పీ శ్రీను, మోడల సహదేవ్ పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న ఏబీవీపీ విద్యార్థులను అరెస్టు చేసి తరలిస్తున్న పోలీసులు

విద్యాశాఖ కార్యాలయం వద్ద ఏబీవీపీ ధర్నా

ఖైరతాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఫీజు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలుచేయాలని, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ శుక్రవారం ఏబీవీపీ పాఠశాల విద్యాశాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించింది. ఏబీవీపీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ మాట్లాడుతూ విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు లక్షలాది రూపాయలు ఫీజు రూపంలో వసూలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని వెంటనే అమలుపరచాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల్లో యూనిఫాంలు, పుస్తకాల విక్రయాలను నిలిపి వేయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల కొరత లేకుండా చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలను మూసివేయాలని డిమాండ్ చేశారు. విద్యా సమస్యలు తీర్చకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అరెస్టయిన వారిలో ఏబీవీపీ రాష్ట్ర నాయకులు కమల్ సురేష్, నాయకులు జీవన్, శ్రీకాంత్, పృధ్వీ, మహేష్ రాజు, ధృవన్, కల్యాణి, సాయి, ప్రసాద్ ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ బానోతు చరణ్ సింగ్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 11.30 గంటల వరకు 11 కేవీ జెక్ కాలనీ, విద్యుత్ టవర్స్, అవంతినగర్ ఫీడర్ల పరిధిలో, ఉదయం 11.30 గంటల నుంచి 12 గంటల వరకు 11 కేవీ శంకర్‌లాల్ నగర్, ప్రభుత్వ ఆస్పత్రి ఫీడర్ల పరిధిలో, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 1.30 గంట వరకు 11 కేవీ ఐఏఎస్ క్వార్టర్స్, రామారావు నగర్ ఫీడర్ల పరిధిలో, మధ్యాహ్నం 12.30 నుంచి 1 గంట వరకు 11 కేవీ సుందర్‌నగర్ ఫీడర్ పరిధిలో, మధ్యాహ్నం 1 గంట నుంచి 1.30 గంటల వరకు 11 కేవీ కుందన్ బాగ్ ట్రాన్సిట్ హాస్టల్, ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్ ఫీడర్ల పరిధిలో, మధ్యాహ్నం 1.30 నుంచి 2 గంటల వరకు 11 కేవీ బీఎస్ మక్తా ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు. బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 11.30 వరకు 11 కేవీ గాయత్రి హిల్స్ టైమ్స్ ఆఫ్ ఇండియా, బీఎన్‌ఆర్ హిల్స్ ఫీడర్ల పరిధిలో, ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు 11 కేవీ సత్యసాయి కల్యాణ మండపం, సీఆర్పీఎఫ్, జూబ్లీహిల్స్ పీఎస్ ఫీడర్ల పరిధిలో, మధ్యాహ్నం 12 నుంచి 12.30 వరకు 11 కేవీ విశ్వభారతి, శబ్దాలయ, సిలికాన్ వ్యాలీ ఫీడర్ల పరిధిలో, మధ్యాహ్నం 12..30 నుంచి 1 గంట వరకు 11 కేవీ లోటస్ పాండ్, నాందరి టెంట్ హౌస్, హైలం కాలనీ, న్యాయవిహార్ ఫీడర్ల పరిధిలో, మధ్యాహ్నం 1 గంట నుంచి 1.30 గంటల వరకు మధురానగర్, క్యాన్సర్ ఆస్పత్రి, ఎన్.సీ.సీ ఫీడర్ల పరిధిలోని, మధ్యాహ్నం 1.30 నుంచి 2 గంటల వరకు మెరీడియన్, పంజాగుట్ట, ఫోనిక్స్ జూబ్లీహిల్స్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

కార్యాలయం ఖాళీ చేయాలని బెదిరించారు

● పోలీసులకు ఫిర్యాదు చేసిన ఉద్యోగి

యూసుఫ్‌గూడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి వేళ కార్యాలయం ఖాళీ చేయాలంటూ దాడి చేసి బెదిరింపులకు పాల్పడ్డారని ఓ వ్యక్తి మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎన్.రమేష్ అనే వ్యక్తి శ్రీనివాస్‌నగర్ వెస్ట్‌లోని ప్రైవేట్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 26వ తేదీ అర్ధరాత్రి సమయంలో పదిమంది గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి వాచ్‌మన్ శ్రీను కుమారుడు మాకు అగ్రిమెంట్ చేశాడని, కార్యాలయం ఖాళీ చేయాలంటూ దుర్భాషలాడుతూ బిగ్గరగా కేకలు వేశారు. బలవంతంగా లోపలకు వచ్చి సిబ్బంది ఫోన్లు విసిరేసి అందర్నీ బలవంతంగా బయటకు నెట్టారు. సిబ్బంది బయటకు వచ్చి పోలీసులకు ఫోన్ చేయగా వారు పారిపోయారు. ఉదయం వరకు కార్యాలయంలోనే ఉన్న రమేష్ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదే సమయంలో పది మంది మహిళలు, మరో పది మంది పురుషులు డీసీఎం తీసుకుని వచ్చి కార్యాలయంలోని ఫర్నిచర్ తీసుకువెళ్లేందుకు ప్రయత్నించారు. సకాలంలో పోలీసులు వచ్చి అడ్డుకున్నారు. గత డిసెంబర్‌లో కూడా ఇదే విధంగా బెదిరింపులకు గురిచేశారని, తక్షణం వారిపై చర్యలు తీసుకోవాలని రమేష్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి గ్రేటర్ మేయర్ గద్వాల విజయలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలసిన అనురాగ్ జయంతి (ఖైరతాబాద్, ఆంధ్రజ్యోతి)



కొత్తగా బాధ్యతలు చేపట్టిన శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలపడంతో పాటు రహ్మత్‌నగర్ ప్రాంతాన్ని సందర్శించాలని కోరుతున్న కార్పొరేటర్ సీఎన్.రెడ్డి (యూసుఫ్‌గూడ, ఆంధ్రజ్యోతి)



ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చిస్తోన్న మేయర్ విజయలక్ష్మి

విగ్రహాల ముసుగు తొలగేదెపుడో?

● ఉద్యోగ సంఘాలతో మేయర్ చర్చలు

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో విగ్రహాల ముసుగు తొలగించే దిశగా అడుగులు పడుతున్నాయి. శుక్రవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సంస్థలోని ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చించారు. సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం అందజేసేందుకు వచ్చిన వారితో విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి నిర్దిష్ట అభిప్రాయం చెప్పాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో దివంతగ సీఎం వైఎస్. రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం ఆయన విగ్రహం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేయాలని అప్పటి స్టాండింగ్ కమిటీలో నిర్ణయించారు. విగ్రహాన్ని తయారు చేయించి మేయర్ కార్యాలయం గేటు వైపు ఏర్పాటు చేశారు. విగ్రహావిష్కరణ కార్యక్రమం జరగకముందే.. నాడు టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పోటీగా మహాత్మ గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలను తీసుకువచ్చి వైఎస్ విగ్రహం పక్కన పెట్టారు. ఇది వివాదాస్పదం కావడంతో మూడు విగ్రహాలకు ముసుగులు కప్పి ఉంచారు. దాదాపు దశాబ్దంన్నర కాలంగా విగ్రహాల ముసుగులు అలానే ఉన్నాయి. సున్నిత అంశం కావడం.. కేసు కోర్టు విచారణలో ఉండడంతో వాటిని ఎవరూ ముట్టుకోలేదు. ముసుగులతో విగ్రహాలు ఉండడం ఇబ్బందికరంగా ఉందని భావించిన మేయర్ ముసుగుల తొలగింపునకు ఉపక్రమించారు. ఈ విషయంపై ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చించారు. కార్యాలయ ప్రాంగణంలోని మరోచోట విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు అభిప్రాయం తీసుకున్నారు. గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలు ఏర్పాటు చేస్తే చాలని కొందరు చెప్పగా.. ఇంకొందరు మూడు విగ్రహాలు ఉండాలని పేర్కొన్నారు. ఈ విషయంపై ఏకగ్రీవ నిర్ణయంతో రావాలని.. మరోసారి సమావేశం నిర్వహించనున్నట్టు విజయలక్ష్మి తెలిపారు.


రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో అధికారులతో కార్పొరేటర్ చీరసుచిత్ర

పెండింగ్ పనులను వెంటనే పరిష్కరించాలి

● కార్పొరేటర్ చీర సుచిత్ర

రాంగోపాల్‌పేట్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో ఎన్నో రోజులుగా పరిష్కారానికి నోచుకోని పెండింగ్ పనులను వెంటనే పరిష్కరించాలని రాంగోపాల్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ చీర సుచిత్ర అధికారులను డిమాండ్ చేశారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ బేగంపేట్ సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య, ఈఈ సుదర్శన్, డీఈ సంతోష్‌కుమార్, ఏఈ శివప్రసాద్, శానిటేషన్ డీఈ శ్రీనివాస్ తదితర అధికారులతో కలిసి డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. వెంటనే పనులను పూర్తిచేయాలని కార్పొరేటర్ అధికారులను కోరారు. దీనికి స్పందించిన ఉపకమిషనర్ సమ్మయ్య వెంటనే పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు చీర శ్రీకాంత్, నాయకులు శివ, నరేందర్‌పాల్, మదన్, శ్రీనివాస్ యాదవ్, చీర శ్రీనివాస్, విష్ణు, ధనరాజ్, రఘు, గోపీ కిషన్, కోమల్ తదితరులు పాల్గొన్నారు.

పాత నేతాజీ స్కూల్ వద్ద మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మించాలి

బోయిన్‌పల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ఒకటవ వార్డు పరిధిలో నిరుపయోగంగా ఉన్న నేతాజీ స్కూల్ స్థలాన్ని బోర్డు ఆధీనంలో ఉన్న స్థలంలో రాష్ట్ర ప్రభుత్వం మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మించాలని శుక్రవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు జంపన ప్రతాప్ వినతిపత్రాన్ని అందజేశారు. కంటోన్మెంట్ బోర్డు సీఈవో, ఎమ్మెల్యే శ్రీగణేష్‌లు నేతాజీ స్కూల్‌ను సందర్శించి వార్డు ప్రజలకు ఉపయోగపడేలా మల్టీపర్పస్ కమ్యూనిటీహాల్ నిర్మాణానికి కృషి చేయాలని జంపన ప్రతాప్ ఈ సందర్భంగా కోరినట్లు తెలిపారు. అదేవిధంగా కంటోన్మెంట్ నియోజకవర్గంలోని బోయిన్‌పల్లి, బాలంరాయి ప్రభుత్వ పాఠశాలల్లో నీటి సమస్యను పరిష్కరించాలంటే బోర్లు వేయాలని శ్రీగణేష్‌కు విజ్ఞప్తి చేయడంతో పాటు బోయిన్‌పల్లిలోని పలు అమ్మవారి దేవాలయాలకు బోనాల నిధులను పెద్ద ఎత్తున అందేలా చూడాలని కోరినట్లు జంపన ప్రతాప్ వెల్లడించారు. కార్యక్రమంలో రామారావు, శ్రీనివాస్, నర్సింహ, రాజు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో మాజీ ఆర్మీ జవాన్‌కు 20 ఏళ్ల జైలు


పెరియాటీ శ్రీధరన్

రెజిమెంటల్‌బజార్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం చేసిన కేసులో మాజీ ఆర్మీ జవాన్‌కు 20ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ పోక్సో స్పెషల్ సెషన్స్ జడ్జీ తీర్పు వెలువరించారు. మార్కెట్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌లోని ఓ అనాథ శరణాలయంలో ఉంటున్న బాలిక 2017లో టైలరింగ్ శిక్షణకు వెళ్లివస్తూ సికింద్రాబాద్ బస్టాప్‌లో కూర్చొంది. ఆమె దగ్గరికి ఆర్మీలో జవాన్‌గా పదవీ విరమణ పొందిన యాప్రాల్‌కు చెందిన పెరియాటీ శ్రీధరన్(59) బైక్‌పై వచ్చి భోజనం చేశావా అంటూ బాలికను బలవంతంగా హోటల్‌కు తీసుకెళ్లి భోజనం చేయించాడు. అనంతరం లాడ్జీకి తీసుకెళ్లి అత్యాచారం చేసి ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించి సికింద్రాబాద్ మనోహర్ థియేటర్ దగ్గర వదిలేసి వెళ్లిపోయాడు. శరణాలయం హెల్త్‌వర్కర్ ఆరా తీయగా అత్యాచారం జరిగిన విషయం చెప్పింది. దీంతో అప్పట్లో (2017 జూలైలో) మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కోర్టులో విచారణ అనంతరం పోక్సో స్పెషల్ సెషన్స్ జడ్జీ పుష్పలత నిందితుడికి 20ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ.20వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

రైల్వే స్టేషన్‌లో సెల్‌ఫోన్ దొంగల పట్టివేత

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో సెల్‌ఫోన్‌లను చోరీ చేస్తున్న ఇద్దరు దొంగలను పట్టుకున్నామని బేగంపేట్ రైల్వే స్టేషన్ ఆర్పీఎఫ్ ఎస్సై నసీమా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో గురువారం మధ్యరాత్రి సమయంలో ఆర్పీఎఫ్ నాగమ్మ శక్తి టీం మహిళా కానిస్టేబుళ్లు డాలీ, మింజ్, శ్రీలేఖలతోపాటు సికింద్రాబాద్ జీఆర్పీ కానిస్టేబుళ్లు తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదస్థితిలో తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకొని తనిఖీ చేయగా వారి వద్ద సెల్‌ఫోన్లు దొరికాయి. విచారణలో ప్రయాణికుల నుంచి చోరీచేశామని నేరం ఒప్పుకున్నారు. వీరిని సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులకు అప్పగించారు.

హత్య కేసులో వీడిన మిస్టరీ

● 10 మందికి రిమాండ్

అల్లాపూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ సఫ్దర్‌నగర్‌లో ఇటీవల జరిగిన హత్య మిస్టరీని పోలీసులు వారం రోజుల్లోనే ఛేదించారు. హతుడు యహ్యా డానిష్(17), నిందితుల్లో ఒకడైన మైనర్ ఒకే అమ్మాయితో సన్నిహితంగా ఉండటమే ఈ హత్యకు కారణమని, పక్కా పథకం ప్రకారమే హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. అల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉంటున్న డానిష్ గత శనివారం రాత్రి స్నేహితులు పిలిచారంటూ ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అదేరోజు రాత్రి స్నేహితులు జహీర్, ఆమెర్, షోయబ్, రేహాన్‌లతో కలిసిన మైనర్ నిందితుడు.. డానిష్‌ను బీరు బాటిళ్లతో కొట్టి, శరీరంలో పొడిచారు. అనంతరం డానిష్‌ది ఆత్మహత్యగా చిత్రీకరించే క్రమంలో బోరబండ ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్ సమీపంలో ట్రాక్‌పై వదిలేశారు. ట్రాక్‌పై నుంచి రైలు వెళ్లిన కారణంగా డానిష్ శరీరం ఛిద్రమయింది. డానిష్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో అల్లాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఐదు రోజుల విచారణానంతరం కేసు కొలిక్కి వచ్చింది. అయితే నిందితులు 10 మందిలో ఐదుగురు మైనర్లు ఉండటం గమనార్హం. శుక్రవారం వారందరినీ రిమాండుకు తరలించినట్టు సమాచారం.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

● ఎమ్మెల్యే శ్రీగణేష్

మారేడుపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. శుక్రవారం మోండా డివిజన్ పరిధిలోని వెస్ట్ మారేడుపల్లి ఎల్ శంకర్‌నగర్ బస్తీలో శ్రీగణేష్ పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత కొన్నేళ్లుగా డ్రైనేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, లోతట్టు ప్రాంతం కావడంతో తమ బస్తీ వరద నీటి ముంపునకు గురి అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తూ స్థానిక బస్తీ ప్రజలు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... వర్షాకాలం కావడంతో ముందస్తు చర్యల్లో భాగంగా లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. వరదనీరు సాఫీగా వెళ్లకుండా కొంతమంది నిర్మాణదారులు వరదనీటి కాలువ స్థలాలను కొంతమేర ఆక్రమించుకొని కట్టడాలను నిర్మించడం వల్ల సమస్య జటిలంగా మారుతుందన్నారు. కంటోన్మెంట్ బోర్డు, జలమండలి అధికారులతో సమావేశమై శాశ్వత పరిష్కారానికి ప్రణాళిక రూపొందించి, డ్రైనేజీ సమస్య నివారణకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే శ్రీగణేష్ భరోసా ఇచ్చారు.


ఎల్‌శంకర్‌నగర్ బస్తీలో డ్రైనేజీ మురుగు నీటి సమస్యను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

సీనియర్ సిటిజన్స్, వాకర్స్ సభ్యులకు వసతులు కల్పిస్తాం

మార్నింగ్ వాకర్స్, సీనియర్ సిటిజన్స్‌తో శుక్రవారం కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీగణేష్ పార్క్ ఆవరణలో సమావేశమయ్యారు. నీటి సదుపాయం, సీసీ కెమెరాలు, చిల్డ్రన్స్ పార్క్‌లో ఆడుకునేందుకు పరికరాలు, తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి వారు తీసుకువచ్చారు. వాకర్స్, సీనియర్ సిటిజన్స్‌తో కలిసి మొక్కలు నాటారు. అనంతరం నెహ్రూనగర్ పార్కు పక్కనే నిర్మిస్తున్న కుస్తీ పోటీ శిక్షణ (దంగల్) భవనాన్ని ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ద్వారా నిధులు సమీకరించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నాయకులు బద్రీనాథ్ యాదవ్, సి.కృష్ణ యాదవ్, శ్యాంసుందర్ రెడ్డి, సదానంద్‌గౌడ్, సంతోష్‌యాదవ్, వినోద్, ఏఈ రవీందర్ పాల్గొన్నారు.


రాష్ట్రపతి నిలయంలో పర్యావరణ అవగాహనా కార్యక్రమంలో భాగంగా ఈనెల 30న సైక్లోథాన్ సైక్లింగ్ ప్రోగ్రామ్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారి స్వాతిషాహి

30న సైక్లోథాన్ ప్రారంభం

తిరుమలగిరి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, హైదరాబాద్ సైక్లింగ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 30న పెడల్ ఫర్ ది ప్లానెట్ థీమ్‌తో సైక్లోథాన్ రాష్ట్రపతి నిలయంలో నిర్వహించబడుతుందని రాష్ట్రపతి నిలయం అధికారి రజినీప్రియ తెలిపారు. శుక్రవారం రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సైక్లోథాన్‌ను ప్రఖ్యాత బ్యాట్‌మింటన్ మాజీ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ ప్రారంభిస్తారని తెలిపారు. రాష్ట్రపతి నిలయం నుంచి ఈసీఐఎల్ క్రాస్ రోడ్స్, తిరిగి రాష్ట్రపతి నిలయం వరకు సైక్లింగ్ కొనసాగుతుందని అన్నారు. ఇప్పటికే 850కి పైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. పౌరులకు పర్యావరణ పట్ల అవగాహన కోసం సైక్లోథాన్ నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం రాష్ట్రపతి నిలయం అందాలను తిలకించడానికి అనుమతినిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ స్వాతి షాహి, పీఆర్ఓ కుమార్ సమ్రేష్ తదితరులు పాల్గొన్నారు.


కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్.

ఆడపడుచులకు వరం కల్యాణలక్ష్మి

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడుపల్లి జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పేదింటి ఆడపడుచుల పెళ్లికి కల్యాణలక్ష్మి ఒక వరమని, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం వెస్ట్ మారేడుపల్లిలోని తన కార్యాలయం వద్ద బేగంపేట డివిజన్‌కు చెందిన 13 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కార్యక్రమం కింద మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలు తమ ఇంటి ఆడబిడ్డ పెళ్లి కోసం పడుతున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కార్యక్రమాలు ప్రారంభించిందని వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ టి.మహేశ్వరి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీహరి, ఆరిఫ్, శేఖర్, ఆకుల హరికృష్ణ, అరుణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ బడిలో నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఆదం భరత్‌కుమార్

ప్రభుత్వ బడిలో నోటు పుస్తకాల పంపిణీ ఘనంగా ఆదం సంతోష్‌కుమార్ జన్మదినం

అడ్డగుట్ట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సికింద్రాబాద్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్ జన్మదినం సందర్భంగా శుక్రవారం తుకారాంగేట్‌లోని ఎంసీహెచ్ క్వార్టర్‌లో ఉన్న ప్రభుత్వ బడిలో చదువుతున్న విద్యార్థులకు ఆదం భరత్‌కుమార్ చేతుల మీదుగా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ముందుగా పాఠశాల ఆవరణలో ఆదం సంతోష్ కుమార్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అడ్డగుట్ట డివిజన్ మాజీ అధ్యక్షుడు గంట రాజుసాగర్, సీనియర్ నాయకుడు కృష్ణ, అంజయ్య యాదవ్, భూపతి హరి, సికింద్రాబాద్ యువజన కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు అనంత కృష్ణారావు, రాము, లీగల్‌నవీన్, మంద ప్రభాకర్, గోక రమేష్, యువజన నాయకులు సాయిచందర్ పాల్గొన్నారు.

తార్నాక ప్రభుత్వ పాఠశాలలో..

కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం తార్నాకలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సెక్రెటరీ అమర్‌నాథ్‌గౌడ్, తార్నాక డివిజన్ అధ్యక్షుడు ఎస్.బ్రహ్మాజీ, కిషోర్ యాదవ్, శైలేందర్, అశోక్, శేఖర్, రవి, జక్రి, క్రిష్ణ, హనుమంతు, గోపాల్ పాల్గొన్నారు.


క్రీడాకారులతో అరోమ సింగ్

ఆర్పీఎఫ్ బ్యాడ్మింటన్ విజేత సికింద్రాబాద్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆర్పీఎఫ్ ఇంటర్ డివిజనల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ 45 ప్లస్ విభాగంలో పురుషుల సింగిల్స్, డబుల్స్ టైటిళ్లను సికింద్రాబాద్ డివిజన్ కైవసం చేసుకుంది. ఈనెల 26వ తేదీ నుంచి సికింద్రాబాద్‌లోని మల్టీపర్పస్ రైల్వే స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియం కాంప్లెక్స్‌లో జరుగుతున్న ఈ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఇందులో విజయవాడ, గుంతకల్, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్ జట్లు తలపడ్డాయి. దక్షిణమధ్య రైల్వే ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమ సింగ్ విజేతలకు పతకాలు, ట్రోఫీలు ప్రదానం చేశారు.

మోదీ.. మద్దతు ధరలపై చట్టం చెయ్!

● రైతులకిచ్చిన హామీని ప్రధాని నిలబెట్టుకోవాలి

● లేదంటే పోరాటం ఉధృతం సంయుక్త కిసాన్ మోర్చా

పంజాగుట్ట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సాగు చట్టాలను ఉపసంహరించుకునే సమయంలో రైతులకు ప్రధాని మోదీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా డిమాండ్ చేసింది. తమ డిమాండ్లు పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని, హరియాణ, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని ప్రచారం చేస్తామని హెచ్చరించింది. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన రైతుల మద్దతు కూడగట్టేందుకు సంయుక్త కిసాన్ మోర్చా చేపట్టిన యాత్ర హైదరాబాద్ చేరుకున్న సందర్భంగా శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. మోర్చా జాతీయ కన్వీనర్ జగ్జీత్‌సింగ్ దలైవాలా, జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లమల వెంకటేశ్వరరావు, దక్షిణ భారత రాష్ట్రాల సమన్వయకర్త కె.శాంతకుమార్, రైతు నాయకుడు పి.చెంగల్‌రెడ్డి, వివిధ రాష్ట్రాల నాయకులు మాట్లాడారు. మోదీకి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే పంటలకు కనీస మద్దతు ధరపై చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష ఎంపీలతో పాటు ఎన్డీఏలోని బీజేపీయేతర ఎంపీలను కలిసి వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. రైతుల సమస్యలపై ప్రైవేటు బిల్లు పెట్టాలని కోరుతామని చెప్పారు. కనీస మద్దతు ధరపై చట్టం కోసం ఫిబ్రవరి 13 నుంచి 4 చోట్ల నిరసనలు చేస్తున్నామని, 125 రోజులకు పైగా వేలాది మంది రైతులు రోడ్డెక్కుతున్నారని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహిస్తున్నామని, వర్షాకాల పార్లమెంటు సమావేశాలకు ముందు ఢిల్లీలో రెండు భారీ సదస్సులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం రూ.2లక్షల వరకు రైతుల రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించడాన్ని స్వాగతించారు. సాగు చట్టాలపై నిరసనల సందర్భంగా రైతులపై ప్రయోగించిన తూటాలు, భాష్పవాయు గోళాలను సమావేశంలో ప్రదర్శించారు. అభిమన్యు కోహర్, లక్వీందర్‌సింగ్ (హరియాణ), పీఆర్ పాండ్యన్ (తమిళనాడు), సూర్జిత్‌సింగ్ (యూపీ), జాఫర్ ఖాన్, సుఖ్‌జీత్‌సింగ్ (ఢిల్లీ), గోవిందరెడ్డి (కర్ణాటక) తదితరులు పాల్గొన్నారు.


రైతులపై ప్రయోగించిన తుపాకీ తూటాలను, భాష్పవాయు గోళీ, రాకెట్ బాంబులను చూపిస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు

బొగ్గు గనుల ప్రైవేటీకరణ ఆపాలి

● సీపీఎం జోన్ కన్వీనర్ అజయ్ బాబు

అడ్డగుట్ట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బొగ్గు గనుల ప్రైవేటీకరణ ఆపాలని సీపీఎం సికింద్రాబాద్ జోన్ కన్వీనర్ అజయ్‌బాబు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. శుక్రవారం అడ్డగుట్ట చౌరస్తాలో సీపీఎం నాయకులు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వేలం వేస్తుందన్నారు. సింగరేణి కంపెనీ కూడా ప్రైవేట్ సంస్థలతో వేలం పాటలో పోటీపడాలని నిర్ణయించుకుందన్నారు. తెలంగాణలో సింగరేణి కాలరీస్‌లో బొగ్గు గనుల తవ్వకం కోసమే స్థాపించిన ప్రభుత్వరంగ సంస్థ సహజంగానే శ్రావణపల్లిలో సింగరేణి బొగ్గు సంస్థ తవ్వాలి కానీ వేలంపాట ద్వారా ప్రైవేట్ సంస్థలకు అవకాశం ఇస్తుందన్నారు. ఇప్పటికే నాలుగు బ్లాకులు గత బీఆర్ఎస్ పాలనలోనే మోదీ ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తుందన్నారు. తెలంగాణలో రాష్ట్రం నుంచి గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి హైదరాబాద్ కేంద్రంగానే వేలంపాట ప్రక్రియను ప్రారంభించడం అన్యాయమన్నారు. పైగా బుకాయిస్తున్నారన్నారు. బొగ్గు బ్లాకులన్నీ ప్రైవేట్ సంస్థలకు ఇచ్చిన అనంతరం సింగరేణికి మిగిలేదేముంది, ఆ తరువాత సింగరేణికి మిగిలేదేముందన్నారు. తెలంగాణకు మణిహారంగా ఉన్న సింగరేణిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. నిరసన కార్యక్రమంలో సీపీఎం సికింద్రాబాద్ జోన్ కమిటీ నాయకులు ఆర్. మల్లేష్, బాలయ్య, మహేందర్, గోపాల్, కృపాకర్, ఫాతిమా, యాకమ్మ, షంషేద్బేగం, సరోజమ్మ, వజ్రాబాయ్ పాల్గొన్నారు.


అడ్డగుట్టలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం పార్టీ నాయకులు


భారత మాజీ ప్రధానమంత్రి పీవీ నర్సింహారావు జయంతిని పురస్కరించుకుని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి శుక్రవారం నెక్లెస్ రోడ్‌లోని పీవీ ఘాట్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. - తార్నాక, ఆంధ్రజ్యోతి

విద్యుత్ స్తంభాన్ని మరోచోట ఏర్పాటుచేయాలి

తార్నాక, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): లాలాపేట్‌లో విద్యుత్ అధికారులు ఇష్టారాజ్యంగా ఇరుకుగా ఉండే వీధుల్లో కరెంటు స్తంభాన్ని ఏర్పాటు చేయడం పట్ల స్థానిక బస్తీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారుల తీరును నిరసిస్తూ శుక్రవారం బస్తీవాసులు తార్నాకలోని విద్యుత్ కార్యాలయంలో అధికారులను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బస్తీవాసులు మాట్లాడుతూ లాలాపేట్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌కు కరెంటు కనెక్షన్ నిమిత్తం విద్యుత్ అధికారులు ముందుగా నిర్ణయించిన ప్రకారం 30ఫీట్ల రోడ్డులో కాకుండా కాంట్రాక్టర్ అక్రమాలకు పాల్పడుతూ ఇష్టారాజ్యంగా ఇరుకుగా ఉన్న 10ఫీట్ల రోడ్డులో కరెంటు స్తంభాన్ని ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీని వల్ల భవిష్యత్‌లో స్థానికులు విద్యుత్ ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని, ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని మరోచోట ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


పేద విద్యార్థినికి ఫీజు చెల్లిస్తున్న సెవన్ రేస్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ సారా

పేద విద్యార్థినికి సాయం

అడ్డగుట్ట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో 9.3 మార్కులు సాధించిన పేద విద్యార్థినికి ఇంటర్‌లో చదువుకునేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో సెవన్ రేస్ ఫౌండేషన్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ సారాప్రీతం కాలేజీలో ఇంటర్ చదువుకునేందుకు ఫీజు చెల్లించి మానవత్వాన్ని చాటుకున్నారు. విద్యార్థినికి తండ్రి లేకపోవడంతో కుటుంబ పోషణ లేకపోవడం, చదువుపై శ్రద్ధ ఉన్న విద్యార్థినికి సాయం చేయడం అదృష్టంగా భావిస్తున్నానని డాక్టర్ సారా తెలిపారు.

సికింద్రాబాద్ నుంచి తుక్కుగూడ ఫ్యాబ్‌సిటీకి బస్సు

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం సికింద్రాబాద్ నుంచి తుక్కుగూడ ఫ్యాబ్‌సిటీ వరకు జూలై 1వ తేదీ నుంచి బస్సును ప్రారంభించనున్నట్లు ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు. రాణిగంజ్ డిపో నుంచి రూట్ నెంబర్ 90/253టి నెంబర్‌తో బస్ సర్వీస్ నడుస్తుందని తెలిపారు. బస్సులు సికింద్రాబాద్, తార్నాక, ఎన్‌జీఆర్ఐ, సర్వే ఆఫ్ ఇండియా, నాగోల్ మెట్రోస్టేషన్, సాగర్ క్రాస్‌రోడ్స్, చంపాపేట క్రాస్‌రోడ్స్, బార్కస్, పహాడీషరీఫ్, తుక్కుగూడ, ఇమాంగూడ మీదుగా ఫ్యాబ్‌సిటీకి చేరుకుంటాయని తెలిపారు. ఫ్యాబ్‌సిటీలో పని చేస్తున్న వారి సౌకర్యార్థం ఈ సర్వీసును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

క్యాచ్‌పిట్ల వద్ద చెత్తాచెదారం తొలగించండి..!

● ఏవీ రంగనాథ్

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వరద నీటి ప్రవాహం సాఫీగా వెళ్లేలా క్యాచ్‌పిట్ల వద్ద ఉన్న చెత్తా చెదారం వెంటనే తొలగించాలని ఈవీడీఎం కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మాదాపూర్‌లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. గ్రేటర్‌లోని 140 ప్రాంతాల్లో వరద నీరు నిలుస్తుందని గుర్తించిన నేపథ్యంలో ఆ ఏరియాల్లో వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా ఏం చేయాలన్నది పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో క్యాచ్ పిట్ల వద్ద చెత్తా చెదారం ఉండడాన్ని గమనించిన ఆయన వెంటనే తొలగించాలన్నారు. వాహనదారులు ప్రమాదానికి గురవకుండా రహదారులపై ఇసుక, కంకర మేటలూ తొలగించాలని సూచించారు.

రైల్వేలో 115మంది ఉద్యోగ విరమణ

చిలకలగూడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): దక్షిణమధ్య రైల్వే, సికింద్రాబాద్‌లో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న 115మంది శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. హెడ్‌క్వార్టర్స్, సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లతోపాటు లాలాగూడ వర్క్‌షాపులో వీరు విధులు నిర్వహించారు. వారికి రావలసిన గ్రాట్యుటీ, మ్యూటేషన్ తదితర బకాయిలు వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేయడానికి చర్యలు చేపట్టి వారికి వచ్చే పెన్షన్ పత్రాలు అందజేశారు. పదవీ విరమణ చేసినవారికి ఆత్మీయ వీడ్కోలు పలుకుతు సికింద్రాబాద్‌లోని రైల్వే కార్యాలయాలు సందడిగా మారాయి. కార్మిక సంఘనాయకులు సిహెచ్.శంకర్‌రావు, భరణి, భానుప్రసాద్, షేక్‌రవూఫ్‌లు రిటైరయిన ఉద్యోగులు, అధికారులను శాలువ, పూలమాలలతో సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు.

అతిథి అధ్యాపక పోస్టులకోసం దరఖాస్తులకు ఆహ్వానం

● మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శైలజ

వినాయకనగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. కంప్యూటర్ సైన్స్, మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీకి సంబంధించిన పీజీ సబ్జెక్టులలో ఎస్సీ, ఎస్టీలు 50శాతం, ఇతరులు 55శాతం మార్కులు కలిగి ఉండాలని పేర్కొన్నారు. పీహెచ్‌డీ, సెట్‌లు పూర్తిచేసినవారికి ప్రాధాన్యత ఉంటుందని, ఆసక్తి కలవారు జూలై 4వ తేదీ సాయంత్రం 6 గంటలలోగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల కార్యాలయంలో తమ దరఖాస్తులు అందజేయాలని సూచించారు. వివరాల కోసం డాక్టర్ శ్రీనివాస్ 94441649903ను సంప్రదించాలని తెలిపారు.